క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రూ.కోట్లల్లో విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ప్రకాష్‌రావు అనే వ్యక్తి మంగళవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. చౌడమ్మ గుట్ట సర్వేనంబర్ 278లో సర్వే కమిషనర్ ల్యాండ్ రికార్డ్ హైదరాబాద్ ఉత్తర్వుల ప్రకారం 7ఎకరాల 9గుంటలు ప్రభుత్వ స్థలంగా ఉందన్నారు. తప్పుడు మ్యూటేషన్ చేయగా, హైకోర్టులో కేసు కొనసాగుతుందని తెలిపారు. కొద్ది రోజులుగా గుట్టపై బునాదులు తవ్వుతూ నిర్మాణాలు ప్రారంభించినందునా నిలిపివేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తాము 12ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేశామని బోసునాయక్ విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ భూమి అయితే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. నిర్మాణానికి సంబంధించి అనుమతి తీసుకోలేదని, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటామని అన్నారు.

ఆటోడ్రైవర్‌ను అభినందించిన ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: ఆటోలో తప్పిపోయిన బ్యాగ్‌ను గుర్తించడానికి పోలీసులకు సహకరించిన జడ్చర్ల ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు షేక్ హాజీని మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ నగదు పురస్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 15న రాత్రి బిజినపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఏడుకొండలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మయూరీ పార్క్ నుంచి జడ్చర్ల సిగ్నల్ గడ్డ వరకు ఓ ఆటోలో వెళ్లాడు. అతడి బ్యాగ్ ఆటోలోనే మరిచిపోవడంతో కానిస్టేబుల్ జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు జడ్చర్ల ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ హాజీ సమక్షంలో సీసీ టీవీ కెమెరాలు పరిశీలించగా, కేవలం 45నిమిషాల వ్యవధిలో ఆటోను గుర్తించినట్లు తెలిపారు. బ్యాగ్‌ను తిరిగి కానిస్టేబుల్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.మహేష్, సీఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

లెదర్‌పార్కు ప్రారంభించండి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి వద్ద ఉన్న లెదర్‌పార్కును ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడతామని చర్మకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యదర్శి కృష్ణయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారుల సంక్షేమం కోసం ఉద్దేశించిన లెదర్‌పార్కు ప్రారంభానికి స్థానిక జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జంగయ్య, శ్రీను, వాసు, కృష్ణయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని 5వ వార్డు ఎర్రగుట్ట సమీపంలో మంగళశారం బోరుమోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ మహమూద్‌షేక్ ప్రారంభించారు. పాత ఆంజనేయస్వామి ఆలయం వద్ద తాగునీటి సమస్య పెరగడంతో బోరుమోటారు అమర్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవనీత, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోటకదిరలో 'బలగం' సినిమా ప్రదర్శన



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోటకదిరలో సర్పంచ్ మల్లు రమ్య ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు. తెలంగాణ యాస, కుటుంబ సభ్యుల మధ్య నెలకొనే విభేదాలు, ప్రేమ ఆప్యాయతలను తెలిపే సినిమాను ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అడ్డాకుల: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మాధవరెడ్డి సూచించారు. మండలంలోని వర్నెలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీలను షేర్ చేస్తే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు మాయం చేస్తారని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. మహిళలు, యువతులు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా తమ దృష్టికి తేవాలని తెలిపారు. గ్రామంలో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయించినా, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

బాలానగర్: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని నెలకు పైగా ముస్లింలు నియమాలతో ఉపవాస దీక్షలు చేస్తారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం బాలానగర్ మండలంలోని మోతీఘణపూర్‌లో ముస్లింలకు సర్పంచ్ మాలతి, ఎంపీటీసీ మనోజ్ఞారెడ్డిలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించారు. మతసామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, గ్రామ పెద్దలు ప్రతాప్ రెడ్డి, యాదిగిరి రెడ్డి, రఫీక్, షమీమ్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో మంగళవారం ఇఫ్తార్‌కు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. పండగలు మతసామరస్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, రైతుబంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మినర్సింహా యాదవ్, కోఆప్షన్ మదీనా జమీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంతో పాటు నిజాలాపూర్‌లో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మూసాపేటలో మృతిచెందిన అస్కని పెద్ద రాములు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు ఏఆర్ నాగరాజుతో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా నిజాలాపూర్‌లో మృతిచెందిన మోత్కాయల భీమయ్యసాగర్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. భీమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, రైతుబంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కోఆప్షన్ మదీనా జమీర్, నాయకులు కొండయ్య, మశ్చందర్, శివరాములు తదితరులు ఉన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు



మోతీఘణపూర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

మైనార్టీలకు రంజాన్ కానుక

నవాబుపేట: మైనార్టీలకు రంజాన్ కానుకను అందిస్తున్నట్లు జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 300మందికి రంజాన్ కిట్లను అందించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 4.50లక్షల స్వయం ఉపాధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, మండల కోఆప్షన్ తాహేర్, ఈఓపీఆర్‌డీ భద్రూనాయక్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నవాబుపేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, శ్రీశైలం, మార్కెట్ డైరెక్టర్ నర్సింహులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలకు ఎంపీపీ సుదర్శన్ రంజాన్ కిటట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, డీటీ మాధవి, ఆర్‌ఐ రామాంజనేయులు, మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, నిరంజన్, శ్రీనివాసులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలంలోని మోతీఘణపూర్‌లో ముస్లింకు మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, యాదిగిరిరెడ్డి మంగళవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



రంజాన్ కానుక అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మతం ముసుగులో బీజేపి కుట్ర రాజకీయాలు



దాచక్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హన్వాడ: మతం ముసుగులో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ఆరోపించారు. మండలంలోని దాచక్‌పల్లిలో మంగళవారం సీపీఐ నాయకులు ఇంటింటికీ ప్రజాపోరు పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో సీపీఐ ఇంటింటికీ ప్రజాపోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ దేశంలోని సహజ వనరులను, దేశ సంపదను మోదీ సర్కార్ దోచుకుంటుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మోదీ నిరంకుశ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్, మండల కార్యదర్శి శంకర్‌నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చాందిపాష, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్, గాంధీనగర్‌లో సీపీఐ ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. ఇందిరానగర్‌లో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 15వరకు ఇంటింటికీ సీపీఐ ప్రజాపోరుయాత్ర కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు అల్వాల్‌రెడ్డి, భాషా, మన్సూర్, కలీం, సురేష్, మాసయ్య, నాగరాజు, అలివేలు పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా చేసుకోవాలి



కానుకలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: పండుగలను సంతోషంగా నిర్వహించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం చిన్నచింతకుంటలో ముస్లింటకు రంజాన్ గిఫ్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పండుగలను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకొనేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తుందని, అందుకే ఆయా మతాల ప్రజలకు పండుగల వేళ పండుగ కానుకలను అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగను కలిసి మెలిసి సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోట రాము, కరుణాకర్ రెడ్డి, కురుమూర్తిస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పాలమూరు: జిల్లా జైలు ఆధ్వర్యంలో జైలు పెట్రోల్ బంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం జైలు సూపరింటెండెంట్ వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జైలు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులతో పాటు వాహనదారుల దహర్తిని తీరుస్తున్నట్లు తెలిపారు.

ఐదేళ్లయినా క్యాంపు కార్యాలయం పూర్తి చేయరా?

దేవరకద్ర: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఐదేళ్లు దాటినా పూర్తి కాకపోవడం ఏమిటని రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం ఆయన దేవరకద్రలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2018 మార్చి 23న దేవరకద్రలో క్యాంపు కార్యాలయం పనులకు శంకుస్థాపన చేశారని, ఐదేళ్లు పూర్తయినా పనులు పూర్తికాకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ నాయకులు అంజన్నయాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

ఇంటింటి సర్వే



మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగమని, కార్యకర్తలే బలమని, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఫతేపూర్‌లో వందమంది ఓటర్ల ఇన్‌చార్జ్‌లతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బీజేపీ ఉందని, ఇందుకు కాంగ్రెస్ వంత పాడుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి పార్టీని మళ్లీ ఆదరించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ అలివేలు కృష్ణయ్య, ఎంపీటీసీ కృష్ణయ్య, ఉప సర్పంచ్ రాజు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

బాలానగర్: మండల కేంద్రంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాల సమాచారంతో మైనింగ్ ఏడీ విజయ్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనుమతి పత్రాలు లేకుండా మైనింగ్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్లపై రూ.36వేల జరిమానా విధించారు. పరిమితికి మించిన లోడ్లతో రాకపోకలు సాగించినా, అనుమతి లేకుండా మైనింగ్ చేపట్టినా జరిమానా తప్పదని హెచ్చరించారు. 2022-23 సంవత్సరంలో అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన 22 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.5లక్షల 19,410ల జరిమానా విధించామని అన్నారు. అనుమతి లేకుండా మైనింగ్‌కు పాల్పడిన 228 వాహనాలపై రూ.19లక్షల 1,524ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.



జరిమానా విధిస్తున్న మైనింగ్ ఏడీ విజయ్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

బాలానగర్: గ్రామాల అభివృద్ధి కోసం సొంత డబ్బులతో పనులు చేసి ఏడాది గడిచినా బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి శంకరప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీఓ నజీర్ అహ్మద్‌ను కలిసి పెండింగ్ బిల్లులను చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ సొంత డబ్బులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, డంపింగ్‌యార్డులు ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏళ్లు గడిచినా బిల్లులు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్సింహా రెడ్డి, మల్లేష్ యాదవ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై కేసు నమోదు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురానికి చెందిన సతీష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతితో సహజీవనం చేసి ఆమెతో పెళ్లికి నిరాకరించినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు. యువతి గర్భవతి కాగా, పెళ్లి చేసుకోమని అడుగగా, నిరాకరించినట్లు ఈనెల 12న యువతి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేట్ లెక్చరర్లకు అవకాశం కల్పించాలి



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యువేషన్ ఎగ్జామినేషన్‌లో ప్రైవేట్ లెక్చరర్లకు సీఎస్, డీఓ, సీఈ, ఏఈలుగా ప్రమోట్ చేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్పాట్ వాల్యువేషన్ సెంటర్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ లెక్చరర్స్ కూడా ప్రభుత్వ లెక్చరర్స్‌తో పాటు సీనియార్టీ ప్రకారం డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా, చీఫ్ సూపరింటెండెంట్లుగా అవకాశం కల్పించాలని కోరారు. పేపర్‌కి ఇస్తున్న రెమ్యునరేషన్ ఫీజు రూ.50కి పెంచాలన్నారు. ప్రైవేట్ ఎంప్లాయిస్‌కి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లోని అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఐఈఓ వెంకటేశ్వర్లుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భరత్, కృష్ణయ్య, శ్రీకాంత్, విఘ్నేశ్వర్‌గౌడ్, శరవంద, భరత్, ఆంజనేయులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించండి

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జీఎస్ దేవదానం డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం కొనసాగిస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, సీతారాం, కార్మికులు పాల్గొన్నారు.

నిర్మాణం అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై బీఆర్‌ఆర్ కళాశాల ఎదురుగా సొంత స్థలం నిర్మాణం చేస్తుండగా కూన యాదయ్య, అతడి కుమారుడు కృష్ణలు అడ్డుకుంటున్నారని నుస్రత్‌బేగం మంగళవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేసీబీతో పనులు చేస్తుండగా వచ్చి బెదిరించారని, కోర్టు నుంచి స్థలం తనదని ఆర్డర్ వచ్చినా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

20న మోతీమసీదులో షబే ఖదర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బోయపల్లిగేట్ మోతీమసీదులో ఈనెల 20న పవిత్ర రంజాన్ మాసం షబే ఖదర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ కార్యదర్శి ఇలియాజ్ ముజాహిద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈషా నమాజ్ రాత్రి 9:30గంటలకు ఉంటుందని, గుల్బర్గాకు చెందిన ప్రముఖ మతపెద్ద అల్లమా మౌలానా సయ్యద్ మొయినుద్దీన్ ఖాద్రీ షర్ఫీ ధార్మిక సందేశం ఇస్తారని తెలిపారు. షబే ఖదర్ వేడుకల్లో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



విద్యుద్దీపాల వెలుగులో మోతీమసీదు

మెనూ ప్రకారం భోజనం అందించాలి



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

హన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీళ్లచారు.. విద్యార్థులకు చాలీచాలని భోజనాన్ని వడ్డిస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించడం లేదని ఏజెన్సీ నిర్వాహకుడు యాదయ్యతో వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ బక్క శ్రీనివాసులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకుని నిర్వాహకులను మందలించారు. సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు కూడా ఇక్కడే భోజనం వడ్డించడాన్ని బీజేపీ నాయకులు నిలదీశారు. ఒంటిపూట బడులు ఉన్న కారణంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకోవడం లేదని, నేరుగా ఇళ్లకే వెళ్తున్నారని హెచ్‌ఎం వివరించారు. భోజనం సరిగా లేని కారణంగానే విద్యార్థులు భోజనం చేయడం లేదని విమర్శించడంతో తహసీల్దార్ కలగజేసుకుని సర్దిచెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, శివలింగం, కేశవులు పాల్గొన్నారు.

రైతువేదికలో ఫ్యాన్లు చోరీ

చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాల రైతువేదికలో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్లు చోరీ చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. గ్రామంలోని రైతువేదికలో ఆరు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్లను దొంగిలించారు. ఏఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



హన్వాడ: వేతనాలు అందక, సమస్యల సాధన సమ్మెలో ప్రాణాలు కోల్పోయిన వీఆర్‌ఏ బాలకిష్టయ్య కుమారుడు శ్రీనివాసులు కారుణ్య నియామకం కింద ఎన్నికయ్యాడు. ఈ మేరకు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు ఉద్యోగ నియామకపత్రాన్ని మంగళవారం శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్‌ఐ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ రామేశ్వర్‌రావు, వీఆర్‌ఏలు వెంకటయ్య, గోవర్ధన్, రాధిక, సీరటి రాములు, భగవంతమ్మ తదతరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

బాలానగర్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పార్టీ మండల కార్మిక శాఖ అధ్యక్షుడు, సింగిల్ విండో డైరెక్టర్ యాదయ్య అన్నారు. మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.55వేల చెక్కును పోషమోని చెన్నయ్య భార్య అనితకు అందజేశారు.

గుంతలు తవ్వి వదిలేస్తే ఎలా?

మిషన్ భగీరథ అధికారులపై సర్పంచ్‌ల ఆగ్రహం

రాజాపూర్: గ్రామాల్లో మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైపులైన్ల కోసం గుంతలు తీసి అలాగే వదిలేయటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లోని రోడ్లు గుంతలుగా మారాయని తెలిపారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని, కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని, ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ మోహన్‌నాయక్, వైస్ ఎంపీపీ భూపాల్ రెడ్డి, తహసీల్దార్ రాంబాయి పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

వ్యక్తి అదృశ్యం



రమేష్ (ఫైల్)

జడ్చర్ల టౌన్: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా సోదరుడు చెప్పకుండా వెళ్లిపోయాడని రాజేష్ అనే వ్యక్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన రమేష్ రెండు రోజుల కిందట భార్యతో గొడవపడి బాదేపల్లి చైతన్యనగర్‌లో నివాసం ఉంటున్న సోదరుడు రాజేష్ ఇంటికి వచ్చాడు. అక్కడ సోదరుడు, కొందరు నచ్చచెప్పగా, అక్కడి నుంచి సోమవారం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవటంతో సోదరుడు రాజేష్ పోలీసులను ఆశ్రయించారు. రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.